క్లుప్తంగా

చిన్నపిల్లలకు టీకాలు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ వారి ఇంట్లోని చిన్నపిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు టీకాలు వేయడం ద్వారా వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. టీకాలు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి వ్యాధుల బారిన పిల్లలు పడకుండా కాపాడుతాయన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ టీకాలు ఉచితంగా లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు నాగిబాయి, ప్రొజెక్షనిస్టు ఖలీల్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ దాడులు



బెల్టుషాపు నిర్వాహకుల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం

కర్నూలు : బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. కర్నూలు స్టేషన్ ఎక్సైజ్ సీఐ చంద్రహాస్, డీటీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలుగ్రామాల్లో తనిఖీలు నిర్వహించి 45 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. దిగువపాడు గ్రామానికి చెందిన రెడ్డిపోగు ప్రసాద్, కేతవరం గ్రామానికి చెందిన కురువ మధుబాబు, లక్ష్మీపురం గ్రామానికి చెందిన శేఖర్, బోయ రామగిడ్డయ్య తదితరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద లభించిన మద్యాన్ని సీజ్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు నవీన్ బాబు, రెహానా బేగం, ఇంద్రకిరణ్ తేజ, సిబ్బంది ఈరన్న, చంద్రపాల్, సుదర్శన్ రాజు, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సిస్టర్స్ స్టానీస్లాస్ విద్యార్థినికి కాంస్య పతకం



విద్యార్థినిని అభినందిస్తున్న రామాంజనేయులు

కర్నూలు (టౌన్): గత నెల 25 నుంచి 27 వరకు హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్ర యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సిస్టర్ స్టానిస్లాస్‌లో 9వ తరగతి చదివే విద్యార్థిని హాసిని బాయ్ పాల్గొని కాంస్య పతకం సాధించింది. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థిని శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ప్రణీత్ కుమార్ పాల్గొన్నారు.

9 న జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 9వ తేదీ జోహరాపురం రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లిషు మీడియం క్రీడా మైదానంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల, మహిళల టెన్నికాయిట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 93084 01721 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతుల ఆత్మహత్యలు పట్టవా?

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి నిలదీత
- ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఉల్లి రైతులకు పరామర్శ



రైతులను పరామర్శిస్తున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పట్టడం లేదని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మండిపడ్డారు. రైతులను ఆదుకోలేకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన క్రిష్ణ, వెంకటనాయుడు అనే ఇద్దరు ఉల్లి రైతులు పంటకు గిట్టుబాటు ధర లేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆ ఇద్దరిని శనివారం ఎస్వీ మోహన్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు. వారికి జరిగిన నష్టాన్ని, పంట వివరాలను కనుగొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచి రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని చెప్పారు. గిట్టుబాటు ధర కల్పించి అండగా నిలబడాల్సిన సర్కారుకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఉల్లికి రూ.1200 గిట్టుబాటు ధర ప్రకటించినా అందులో సగం కూడా కొనడం లేదని మండిపడ్డారు. వారు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, దీంతో అప్పుల బాధ తాళలేక రైతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారని తెలిపారు. ఉల్లికి రూ.2500 ఇస్తే కానీ రైతులకు పంట గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొందన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు రైతులు ఒకేసారి పొలంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారంటే పరిస్థితి ఏమిటో ప్రభుత్వం అర్థం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి పాటిల్ హనుమంత రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి పాటిల్ తిరుమలేశ్వరరెడ్డి, నాయకులు షరీఫ్, రఘు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం కళ్లు తెరవాలి

కర్నూలు(సెంట్రల్) : కష్టపడి పండించిన ఉల్లికి సరైన మద్దతు ధర లేకపోవడంతో సి.బెళగల్ మండలం పోలకల్‌కు చెందిన రైతు వెంకట నాయుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని, ఈ ఘటనతోనైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. క్వింటాల్ ఉల్లికి రూ.3 వేల గిట్టుబాటు ధర ఉంటేనే రైతు బాగుపడతాడని, అయితే ప్రభుత్వం ప్రకటించిన రూ.1200 ఏ మాత్రం సరిపోదని, కూలీల ఖర్చు కూడా రాదని మహేష్‌నాయుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉల్లి రైతులను ఆదుకోవాలని, పైపైకి మాటలు చెప్పడం మానుకోవాలన్నారు. వెంటనే సర్కారే ఉల్లిని క్వింటాల్ రూ.3 వేల ప్రకారం కొనుగోలు చేయాలని శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

యువతకు మారథాన్ పోటీలు



పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): యూత్ ఫెస్ట్‌లో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో శనివారం నగరంలో యువతకు జిల్లా స్థాయి 5 కి.మీ పరుగు పోటీలు (మారథాన్)ను నిర్వహించారు. ఈ పోటీలను ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ ప్రారంభించారు. ఈ పరుగు పోటీలు కోల్స్ కళాశాల నుంచి పార్కురోడ్డు, రాజవిహార్, కర్నూలు మెడికల్ కాలేజీ, సి.క్యాంపు మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వరకు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 58 మంది విద్యార్థినులు, 55 మంది విద్యార్థులు, 5గురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు. పోటీలో పురుషుల విభాగంలో టి.నాగ శ్రీనివాసులు, రూ.10వేలు, సి.హరికృష్ణ రూ.7 వేలు, మహిళా విభాగంలో మద్దూర్ రేణుక రూ.10వేలు, సి.దేవి రూ.7వేలు, ట్రాన్స్‌జెండర్ విభాగంలో జి.లీలాప్రసాద్ రూ.10వేలు, రక్షిత రూ.7 వేలు గెలుచుకున్నారు. వారికి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖాధికారి భూపతిరావు, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీహైదర్, ఏపీ శాక్స్ ప్రోగ్రామ్ గణాంకాధికారి దేవిశంకర్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలతో ఆక్వా రంగానికి తీవ్ర నష్టం

- కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్షాలు

కర్నూలు(సెంట్రల్): అమెరికా అధ్యక్షుడు ట్రంపు విధిస్తున్న సుంకాలతో ఆక్వా రంగం అధికంగా నష్టపోతుందని, ఏకంగా 40 శాతం పన్ను విధించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నిర్మల, టి.రాముడు, ఎండీ ఆనంద్‌బాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎస్.లెనిన్‌బాబు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలు విధిస్తున్న భారత ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ నిరసన, ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అలాగే దేశంలోకి పరాయి పత్తిని అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న 11 శాతం పన్నును ఎత్తివేయడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పత్తి పంటను అధికంగా సాగు చేసే కర్నూలు జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనైతిక పన్ను విధానాన్ని ట్రంపు ప్రవేశపెడుతుంటే ఆయన మిత్రుడిగా ఉన్న మోదీ పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి, ప్రతిపక్ష పార్టీలు కూడా రైతుల పక్షాన పోరాటం చేయడం లేదని, వారు కూడా మోదీని ప్రశ్నించడం లేదని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు జగన్నాథం, శ్రీనివాసులు, రామాంజనేయులు, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు, సాయిబాబా, సుధాకరప్ప, రామకృష్ణ, షరీఫ్, అబ్దుల్‌దేశాయ్, భాస్కర్, యేసురాజు, కృష్ణ, రఫీ పాల్గొన్నారు.

టీజీ కంపెనీల రసాయనాలతో పర్యావరణం కలుషితం

- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ఆందోళన



సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల నాయకులు, పర్యావరణ పరిరక్షణ సమితి నాయకులు

కర్నూలు సిటీ: టీజీవీ గ్రూప్ సంస్థ అత్యంత ప్రమాదకర పీటీఈఎఫ్ అనే విష రసాయనం తయారీకి పర్యావరణ శాఖ నుంచి అనుమతులు తెచ్చుకున్నారని, ఈ రసాయనాలతో తుంగభద్ర నదీ జలాలు, కర్నూలు నగర పరిసర వాతావరణం అత్యంత కలుషితమవుతుందని ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఎస్టీయూ భవనంలో కర్నూలు జల వనరులను కాల్యుష బారి నుంచి కాపాడుకుందాం అనే అంశంపై పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. టీజీవీ గ్రూప్ కంపెనీల నుంచి వెలువడే రసాయనాలతో నగరం చుట్టు పక్కల గ్రామాలైన గొందిపర్ల, ఈ.తాండ్రపాడు, వసంతనగర్‌తో పాటు మరో పది గ్రామాల్లో నీరు, గాలి, నేల విషపూరితంగా మారి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రజలు మేల్కొని విష రసాయనాల ఉత్పత్తిని నిలుపుదల చేయించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్‌గా రామకృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ హమీద్, రిటైర్డ్ లెక్చరర్ రమేష్, ఇనాయతుల్లా ఖాన్, గద్వాల ఈరన్న, పీటీపీ యోహాన్, మహిళా సంఘం నాయకులు పద్మ, శ్రావణి, డేవిడ్, నౌషద్, సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఉంటారని వారు తెలిపారు.

11న విద్యార్థులకు క్విజ్ పోటీలు

కర్నూలు కల్చరల్: మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర తిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమరావు 143వ జయంతిని పురస్కరించుకొని గాడిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాంటిస్సోరి పాఠశాల సహకారంతో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర తెలిపారు. విద్యా నగర్ మాంటిస్సోరి పాఠశాలలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రాథమిక పోటీ, 13వ తేదీ ఫైనల్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 9వ తేదీ లిఖిత పూర్వకంగా నరసం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మికి తెలియ జేయాలని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఒక బృందంగా పాల్గొన వచ్చని పేర్కొన్నారు. '1905 నుంచి 1947వ సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య ఉద్యమం' అనే అంశంపై క్విజ్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. విజేతలకు ఈనెల 14న బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 94403 59430 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యమ బాటకు సిద్ధమవుతున్న విద్యుత్ ఉద్యోగులు



విద్యుత్ శాఖ ఎస్ఈకి నోటీసు ఇస్తున్న విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్‌లను సాధించుకునేందుకు ఉద్యమ బాట పట్టనున్నారు. ఈ నెల 15 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సిద్ధం చేసింది. చేపట్టే ఆందోళనల పై జేఏసీ ప్రతినిధులు శనివారం విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతిని కలిసి నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు సతీష్‌కుమార్, లక్ష్మీకాంతరెడ్డి, రామరాజు, రమణమూర్తి, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

కుడా నిధులతో సీసీ కెమెరాల ఏర్పాటు

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) నిధులు రూ.29.84 లక్షలతో నగరంలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో రూ.29.84 లక్షలకు సంబంధించిన చెక్కును మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఇప్పటికే నగరంలో మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 150 సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయని, కొత్తగా వచ్చే 100 అత్యాధునిక కెమెరాలతో నేరాల నియంత్రణకు ఎంతో అనువుగా ఉంటుందని చెప్పారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ..కర్నూలు నగరంలో ఇప్పటికే 150 కెమెరాలను ఏర్పాటు చేశామని, వీటికి తోడుగా మరో 100 కెమెరాలు ఏర్పాటైతే భద్రత వ్యవస్థ మరింత మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేద్దాం



అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: ఈ నెల 9న నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ పాణ్యం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కేవీ రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 26వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి నేతలు యూరియాను కృత్రిమ కొరతు సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక రైతన్నలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాయకులు ఈశ్వరయ్య, శ్రీధర్‌రెడ్డి, కేశవరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సుంకన్న, హనుమంతురెడ్డి, సుబ్రమణ్యం శెట్టి, సత్యంరెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం



ఐసా ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి ఏ నాగరాజు, జిల్లా కార్యదర్శి ఎస్ నాగార్జున అన్నారు. శనివారం ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో విద్యార్థులు సంక్షేమ భవన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలకు అరకొర నిధులు కేటాయించడం ద్వారా సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకులకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందడం లేదన్నారు. ఒక్కో విద్యార్థికి డైట్ చార్జీలను నెలకు రూ.3 వేల ప్రకారం చెల్లించాలన్నారు. అలాగే అద్దె భవనాల్లో అనేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న కుక్, కామాటీ, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వసతి గృహ సంక్షేమాధికారుల పోస్టులు కూడా భర్తీ కాకపోవడంతో ఒక్కో వసతి గృహ సంక్షేమాధికారికి రెండుకు మించి హాస్టళ్లను ఇన్‌చార్జ్ ఇవ్వడం వల్ల వారు ఆయా వసతి గృహాలకు న్యాయం చేయలేక పోతున్నారన్నారు. హాస్టళ్లలో ఉండకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌డబ్ల్యూఓలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, నాయక్ పాల్గొన్నారు.

ప్రముఖ రంగస్థల నటుడు వన్నెం బలరాం అస్తమయం



వన్నెం బలరాం (ఫైల్)

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, పంచాయతీ రాజ్ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన వన్నెం బలరాం (70) శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతూ తుదిశ్వాస విడిచారు. బలరాం టీజీవీ కళాక్షేత్రం కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. తన నటనా ప్రతిభతో రెండు నంది అవార్డులు అందుకున్నారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన నరనారాయణ నాటకంలో శకుని పాత్రకు ఉత్తమ క్యారెక్టర్ నటుడు నంది అవార్డును, ఓ మనిషీ నీకు జోహార్లు నాటకంలో సేట్ పాత్రకు ఉత్తమ హాస్య నటుడు నంది అవార్డు పొందారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన బావా ఎప్పుడు వచ్చితీవు నాటకానికి ఆయన దర్శకుడిగా వ్యవహరించారు. పలు రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. శనివారం ఉదయం బుధవార పేటలోని ఆయన గృహంలో భౌతిక కాయాన్ని సందర్శించి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, టీజీవీ కల్చరల్ అకాడమీ అధ్యక్షులు వీవీ రమణారెడ్డి, కళాకారులు సంగా ఆంజనేయులు, దస్తగిరి, మహమ్మద్ మియ్యా, కథా రచయిత ఇనాయతుల్లా, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక సమన్వయకర్త బైలుప్పల షఫీవుల్లా సంతాపం ప్రకటించారు.

ఘనంగా గురు పూజోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య

కర్నూలు సిటీ: స్థానిక మాధవీనగర్, రెవెన్యూ కాలనీలలో ఉన్న సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఘనంగా నిర్వహించారు. ఆ స్కూళ్ల కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య పాల్గొని డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరు డా.సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. తర్వాత ఉపాధ్యాయులను సన్మానించారు.
– రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేయాలన్నారు. అనంతరం ఆ విద్యా సంస్థల అకడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్, వైస్ చైర్మన్ వంశీధర్, తదితరులు ప్రసంగించారు.

నేడు సాహితీ, కళారంగ ఉపాధ్యాయ సన్మానం

కర్నూలు కల్చరల్: సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సాహితీ కళా రంగంలో పేరుపొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, సి.యాగంటీశ్వర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 16 మంది ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. డీఈఓ శామ్యూల్ పాల్, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

ఏఐబీఈ మోడల్ టెస్టు నిర్వహణ

కర్నూలు(సెంట్రల్): భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఏఐబీఈ (ఆల్ ఇండియా బార్ ఎగ్జామ్) పరీక్షను శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా న్యాయవాదుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన పరీక్షకు పదుల సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. మోడల్ పరీక్షతో పలు అనుమానాలు నివృత్తి అవుతాయని ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రంగనాథ్, బార్ అసోసియేషన్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి పి.దస్తగిరి, జిల్లా సహాయ కార్యదర్శి షఫీ, డోన్ న్యాయవాది జీవన్‌బాబు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్: అటవీ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ప్రభుత్వ సలహాదారులు పి.మల్లికార్జున రావు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శనివారం కర్నూలు సిటీ ఫారెస్ట్‌ను సందర్శించారు. ఆ శాఖ కర్నూలు సర్కిల్ సీఎఫ్ యశోదాబాయి కర్నూలు ఇన్‌చార్జి డీఎఫ్‌వో విజ్ఞేష్ అప్పావు, నంద్యాల, కడప డీఎఫ్ఓలు నాగమునీశ్వరి, వినీత్, కర్నూలు డివిజన్ ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో రవిశంకర్, కడప డివిజన్ సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ శివకుమార్, కర్నూలు, ఆదోని ఎఫ్ఆర్‌వోలు విజయకుమార్, తేజశ్వినిలతో సమావేశమై పలు అంశాలను చర్చించారు. అనంతరం అటవీ శాఖ విశ్రాంత అధికారులు టి.రామచంద్రా రావు, పి.శివశంకర్‌రెడ్డి, రాజేంద్ర, ఖాదర్‌బాషా, సూర్యచంద్రరాజు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలను తెలియజేశారు.

10 నుంచి ఇన్నర్ ఇంజనీరింగ్‌పై శిక్షణ తరగతులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 10వ తేది నుంచి 16వ తేది వరకు ఇన్నర్ ఇంజినీరింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఈషా యోగా సెంటర్ కర్నూలు కో ఆర్డినేటర్ సుధీర్, వలంటీర్ డాక్టర్ నవంతిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఒక బ్యాచ్, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు మరో బ్యాచ్ కొనసాగుతుందన్నారు. 10వ తేది ఉదయం, సాయంత్రం 6 గంటలకు పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇందులో మానసిక, శారీరక ఆరోగ్యంపై యోగాసనాలు, ధ్యానం, ఆహార, విహారాదుల గురించి వివరించి శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తిగల వారు 96636 55003, 84999 80150, 801198 32238 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.